**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 110, పేజీలు - 08

మంగళవారం,అక్టోబర్ 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులపై కొత్త ప్లాన్!

## - కేసీఆర్ సోషల్ ఇంజనీరింగ్ స్కెచ్.?




**హైదరాబాద్** తెలంగాణ రాజకీయాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మునుపెన్నడూ లేనంత రసవత్తరంగా మారాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్‌తో పాటు నల్గొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గాల స్థానాలకు ఫారం-18 ద్వారా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈసారి ఓటర్ల జాబితాను పూర్తిగా కొత్తగా రూపొందిస్తుండటంతో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రధాన రాజకీయ పార్టీలన్నీ భుజాన వేసుకున్నాయి. అధికార కాంగ్రెస్ ఇప్పటికే తమ అభ్యర్థుల ప్రకటన, ఓటర్ల నమోదులో ముందంజలో నిలవగా, విపక్ష బీఆర్ఎస్, బిజెపి మాత్రం తగు వ్యూహంతో తుది అభ్యర్థుల ఎంపికపై అంతర్గత కసరత్తును ముమ్మరం చేశాయి.

### బలమైన నేతల కోసం కేసీఆర్ అన్వేషణ

ప్రధానంగా గులాబీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు ఈ గ్రాడ్యుయేట్ స్థానాలను దక్కించుకోవడాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అనంతరం విద్యావంతులు, ఉద్యోగులు, పట్టభద్రుల్లో బీఆర్ఎస్ పట్ల ఉన్న అభిప్రాయాన్ని సానుకూలంగా

2లో..

# డీలిమిటేషన్ బిల్లుపై మరో అడుగు

## - ఖర్గే డిమాండ్ పై స్పందించిన కేంద్రం!





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీలుగా రూపొందించిన డీలిమిటేషన్ బిల్లును మరోసారి పార్లమెంట్ లో ప్రవేశపెట్టి నెగ్గించుకునేందుకు కేంద్రం పావులు కదుపుతోంది. అయితే గతంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేంద్రం తగిన సంప్రదింపులు జరపాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరుతూ రాజ్యసభలో విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ప్రధాని మోడీకి తాజాగా మరో లేఖ రాశారు. దీనిపై స్పందిస్తూ పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆయనకు లేఖ రాశారు. ప్రధానికి రాసిన లేఖకు స్పందనగా ఈ అంశంపై ప్రతిపక్షాలతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు సంబంధించిన కొన్ని విషయాలను స్పష్టం చేయడానికి, వాస్తవాలను అధికారికంగా తెలియచేయడానికి తాను ఈ లేఖ రాస్తున్నట్లు రిజిజు తెలిపారు. ఇందులో మొదటిది 2026 ఆగస్టు 13న పార్లమెంటు సమావేశాలు నిరవధికంగా వాయిదా

2లో..

# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్

## - పొదుపు బాటలో ప్రభుత్వం!

- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎల్‌నినో కారణంగా ఏర్పడుతున్న పరిస్థితులపై సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు, రాష్ట్రంలో తగిన చర్యలు చేపట్టేందుకు ప్రత్యేకంగా ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘానికి ఛైర్మన్‌గా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరిలను సభ్యులుగా నియమించారు. అదేవిధంగా సీఎం సలహాదారు రామకృష్ణారావును ఈ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. ఈ సబ్‌కమిటీ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు, సూచనలు జారీ చేయనుంది.

### ఎల్ నినో ముప్పుపై ప్రజలను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం 'నీటిని ఆదా చేయండి, విద్యుత్‌ను ఆదా చేయండి' అనే వ్యూహాన్ని కేంద్రంగా చేసుకుని వనరుల పరిరక్షణ, పొదుపు మార్గాలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా గవర్నమెంట్ ఆఫీసుల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులకు సూచించారు. అలాగే పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఏసీ వినియోగించవద్దని వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంచి ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. అదే విధంగా సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఏసీ వినియోగాన్ని వీలైనంత మేర తగ్గించాలని ఆదేశించారు.నీటిని ఆదా చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు

2లో..

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

## - నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి




అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ స్పష్టం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 663 జెడ్పీటీసీలు, 9,859 ఎంపీటీసీలు ఉండగా, కొన్ని కారణాల వల్ల మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. మొత్తంగా

2లో..

# అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు..

# ఇప్పుడు పెడబొబ్బలా.?

## - వైసీపీపై సీఎం చంద్రబాబు ఫైర్




- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన సీఎం

అమరావతి (ప్రశ్న న్యూస్) సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే

2లో..

# కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి

## - రేవంత్ సర్కార్‌కు కవిత డిమాండ్

- రైతులకు నీరివ్వకపోతే ఊరుకోం - మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోవచ్చు
- రేవంత్ ప్రభుత్వానికి కవిత సూచనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రవహిస్తున్న గోదావరి నీటిని పరిశీలించిన ఆమె కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందించే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కరువు పరిస్థితుల్లోనూ నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగునీరు ఒదించడంలో నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.కరువు కాలంలోనూ సుమారు 2 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని కవిత పేర్కొన్నారు. 93 మీటర్ల పొడవునా కాపర్ డ్యామ్ నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పరిశీలించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

2లో..

# ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం

## - సీఎం రేవంత్ చేతుల మీదుగా కార్యక్రమం

## - పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను సీఎం రేవంత్ రెడ్డి అక్టోబర్ 19 న ప్రారంభించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో భాగంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను ప్రారంభించారు. సైబరాబాద్-రాచకొండ పోలీస్ కమిషనరేట్స్ రీ ఆర్గనైజేషన్ లో భాగంగా 2025 లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషనరేట్ ను ఏర్పాటు చేసింది. ప్రజలకు శాంతి భద్రతలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ఈ కమిషనరేట్ పరిధిలోకి ఇబ్రహీంపట్నం,

2లో..

# హైదరాబాద్‌లో ఫేక్ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం

## - 8 నెలల్లో 100 మందిపై క్రిమినల్ కేసులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో నకిలీ, ట్యాంపర్ చేసిన నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వాహనాల గుర్తింపును దాచిపెట్టడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 8 నెలల్లో 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 100 క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగంపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 88 ద్విచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ విషయంపై ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, డి. జోయల్ డేవిస్ మాట్లాడుతూ నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను

2లో..

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి

## - ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

2లో..




## హయత్ నగర్ ఆదర్శనగర్ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ.**





ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆడబిడ్డలు ఆత్మీయతకు పకృతి ప్రేమకు, పూల పండుగ వైభవానికి ప్రతిక బతుకమ్మ తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో జరుపుకునే బతుకమ్మ సంబరాల్లో చివరి రోజున సద్దుల బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో మహిళలు చేసే సందడి తెలంగాణ పల్లెల్లో పండుగ శోభను నింపుతుంది.తంగేడు, గునుగు, బంతి చామంతి, తదితర రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను పేర్చడం ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణ, ప్రకృతిలో లభించే పూలను పూజలు చేస్తూ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఇరుగుపొరుగు వారితో కలిసి మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు.సద్దుల బతుకమ్మ రోజున ఐదు రకాల సద్దుల నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బాలగోని విజయ్ గౌడ్, జనరల్ సెక్రెటరీ వెంకన్న, ట్రెజరర్ రమేష్, గౌరవ అధ్యక్షులు మహేష్ కుమార్ నేత, సత్తయ్య గౌడ్, వైస్ ప్రెసిడెంట్ పందరి, జాయింట్ సెక్రెటరీ బొంగు భరత్ గౌడ్, కాలనీ వాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామగిరి ఖిల్లాపై అలుపెరుగని అడుగులు

**- 15 కిలోమీటర్ల కఠోర యాత్రలో 300 అరుదైన వనమూలికల గుర్తింపు**

**- భావితరాలకు ఔషధ సంపదను అందించే దిశగా ఆయుర్వేద పరంపర వైద్యుల చారిత్రక కృషి**



తెలంగాణ ప్రాకృతిక సౌందర్యానికి, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన రామగిరి ఖిల్లా... కేవలం ఒక దుర్భేద్యమైన



రాతి కోట మాత్రమే కాదు, అది ప్రాణాలను నిలబెట్టే అరుదైన ఔషధ వృక్షాల భాండాగారం. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపు మేరకు ఇటీవల నిర్వహించిన "మన జిల్లా - మన రామగిరి ఖిల్లా" ట్రెక్కింగ్ కార్యక్రమం ఒక సాధారణ పర్వతారోహణలా కాకుండా, అంతరించిపోతున్న అటవీ వనమూలికలను కాపాడుకునే మహా యజ్ఞంలా సాగింది.

### ఎనిమిది గంటల శ్రమ.. 15 కిలోమీటర్ల అరణ్య శోధన

దుర్భేద్యమైన కొండలు, నిటారైన ఎత్తుపల్లాలు, రాళ్లు రప్పల మధ్య 15 కిలోమీటర్ల మేర సాగిన ఈ కఠోర యాత్రలో



అడుగడుగునా శ్రమ దాగి ఉంది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎనిమిది గంటల పాటు సాగిన ఈ అరణ్య శోధనలో అరుదైన ఔషధ మొక్కల రక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న ప్రముఖ ఆయుర్వేద వృక్ష పరిశోధకులు, 'ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం' వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సింహాచలం లక్ష్మణస్వామి బృందం చూపించిన పట్టుదల అనన్య సామాన్యం.

### 300కు పైగా వనమూలికల గుర్తింపు - కలెక్టర్‌కు నివేదిక..

కొండపై ఉన్న అడుగడుగు అరణ్యాన్ని జల్లెడ పడుతూ ప్రాణదాతలైన రక్తరోహిణి, సంజీవని లాంటి అద్భుతమైన 300కు పైగా అరుదైన ఔషధ మొక్కలను ఈ బృందం స్వయంగా గుర్తించింది. పర్యావరణ పరిరక్షణలో పరంపర వైద్యుల కృషి ఎంత గొప్పదో చాటిచెబుతూ ఈ యాత్రలో గుర్తించిన మొక్కల వివరాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను (వృక్ష జాబితాను) త్వరలోనే కలెక్టర్ కి, ప్రభుత్వానికి సమర్పించేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఈ అడుగు రామగిరి ఖిల్లాను భవిష్యత్తులో ఒక ఆదర్శవంతమైన 'ఔషధ వనంగా' తీర్చిదిద్దడానికి వేస్తున్న బలమైన పునాది.

### జీవవైవిధ్య కాపలాదారులుగా పరంపర వైద్యులు

ప్రకృతిని కాపాడుకోకపోతే భావితరాలకు మనుగడ లేదు. అడవి తల్లి ఒడిలో ఉన్న ప్రతి మొక్కా మానవాళికి రక్ష అని నమ్మే



అనువంశిక పరంపర వైద్యులే నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్యానికి నిజమైన కాపలాదారులు అని ఈ యాత్ర నిరూపించింది. స్వార్థానికి బలైపోతున్న అమృత తుల్యమైన మొక్కలను గుర్తించి, వాటి ప్రాముఖ్యతను భావితరాలకు అందించే క్రమంలో 'ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం' చేస్తున్న కృషి మరువలేనిది. ఇంతటి కఠోరమైన యాత్రను అద్భుతమైన ఏర్పాట్లతో, ఎలాంటి ఇబ్బందీ లేకుండా విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగానికి, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కి, ట్రెక్కింగ్ ప్రారంభించి స్ఫూర్తినింపిన ఏఎస్పీ మడత రమేష్ గౌడ్ కి, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కి, నిర్వాహకులు, పర్వతారోహకులు లెంకల మహిపాల్ రెడ్డి కి, కోట చరిత్రను ఆసాంతం వివరించిన సునీల్ కి, సాగర్, విష్ణు ,వెంకటేష్, ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు. వికారాబాద్ అరణ్య ప్రాంతంలో ఔషధ మొక్కల యాత్ర త్వరలోనే ఉంటుంది ప్రకృతి రక్షణ కోసం సాగుతున్న ఈ ప్రయాణం నిరంతరం కొనసాగుతుంది.

సింహాచలం లక్ష్మణస్వామి,
ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఒ ప్రకృతి ప్రేమికులు,
వ్యవస్థాపక అధ్యక్షులు,
ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం,
(రిజిస్ట్రేషన్ నంబర్: 979/2025).
నారపల్లి, హైదరాబాద్.
సెల్ నంబర్: 90001 87858

## ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తుల ను సత్వరమే పరిష్కరించాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ( డిఆర్ఓ) మాలతి హాజరై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు, అర్జీదారుల నుంచి మొత్తం 23 దరఖాస్తుల ను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, ఆచరణాత్మకమైన చర్యలు తీసుకొని త్వరతగతిన సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. బాధితులు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది మరియు అర్జీదారులు పాల్గొన్నారు.?

# అనంతసాగర్‌లో సంప్రదాయబద్ధంగా ముగిసిన బతుకమ్మ సంబరాలు

చిన్నకోడూరు (ప్రశ్న న్యూస్) పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మ సంబరాలతో ఘనంగా ముగిసాయి. సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయబద్ధంగా ముస్తాబైన మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి గౌరిదేవిని స్తుతిస్తూ ఆట పాటలతో సందడి చేసారు. మహాలయ అమావాస్య నుండి ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు రకరకాల పూలతో విభిన్న రూపాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగిసాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఐదు రకాల సద్దులను గౌరమ్మకు నైవేద్యంగా నివేదించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మ ఆట పాటలు, పూల వాసనలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగులతో గ్రామమంతా కళకళలాడింది. మహిళల ఆటపాటలు, కోలాటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలతో తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించిన బతుకమ్మ పండుగకు ఘనమైన ముగింపు పలికారు.

### గ్రామ విశేషాలు



అనంతసాగర్ అనే గ్రామం సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండల పరిధిలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శ్రీ సరస్వతీ దేవి క్షేత్రము (నిలుచున్న



రెండవ వీణాపాణి క్షేత్రం) భారత దేశంలోని కొన్ని అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. బాసర తర్వాత తెలంగాణలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన సరస్వతి దేవి పుణ్యక్షేత్రంగా భక్తులు విశ్వసిస్తారు. కొండల మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో అక్షరాభ్యాసాలకు, విద్యార్థుల జ్ఞానార్జనకు ఇది ఎంతో ప్రసిద్ధి. రాగిదోనె, పాలదోనె, చీకటిదోనె ఈ గ్రామ మరో ప్రత్యేకత

## భక్తుల ఆరోగ్యమే లక్ష్యం.. సమన్వయంతో వైద్యశాల సేవలు

**శ్రీశైల దేవస్థానం వైద్యశాలలో ఆయుధ పూజ**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) దేవస్థానం పరిధిలోని వైద్యశాలలో ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైద్యశాలలో భక్తులు, సిబ్బందికి వైద్య సేవలు అందించేందుకు వినియోగించే వైద్య పరికరాలకు పూజలు నిర్వహించారు.దేవస్థానం సేవల్లో వైద్యశాల కీలక భాగంగా నిలుస్తోంది. క్షేత్రానికి విచ్చేసే భక్తులు, దేవస్థానం సిబ్బందికి అవసరమైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య సహాయం అందించేందుకు వైద్యశాల సిబ్బంది కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం వైద్యశాల గుమస్తా కె. శ్రీనివాస ప్రసాద్, వైద్యాధికారులు డా. సుధాంశు, డా. హంసరాజు, స్టోర్ ఇన్‌చార్జ్ దాసరి విక్రమ్, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సమన్వయం, సేవాభావం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో ముందుకు సాగుతున్న వైద్యశాల సిబ్బంది కృషి అభినందనీయం.

## శ్రీశైలానికి అంతర్జాతీయ గుర్తింపు

**భక్తిసేవలకు ఐఎస్ఓ ముద్ర.. నాలుగు విభాగాల్లో ధ్రువీకరణలు**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) భక్తి.. సంప్రదాయం.. సేవ.. నాణ్యత! ఈ నాలుగు అంశాల సమ్మేళనంగా శ్రీశైల క్షేత్రం దసరా మహోత్సవాల వేళ మరో విశిష్టతను సంతరించుకుంది. ఒకవైపు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణతో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా.. మరోవైపు భక్తులకు అందిస్తున్న సేవలు, ఆలయ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత వంటి విభాగాల్లో దేవస్థానానికి నాలుగు ధ్రువీకరణలు లభించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి తోడు 2027 సంవత్సరానికి సంబంధించిన ఐదు రకాల క్యాలెండర్లను ఆవిష్కరించడంతో శ్రీశైలంలో దసరా వేడుకలు భక్తి వైభవంతో కొనసాగాయి.

### స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టువస్త్రాలు

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు.
సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, పట్టువస్త్రాలకు పూజాదికాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ ఆలయంలోకి ప్రవేశించి స్వామిఅమ్మవార్లకు వస్త్రాలు సమర్పించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నర్సీపట్నం జనసేనలో కీలక మార్పులు

**కొణతాల, పంచకర్లకు సమన్వయ బాధ్యతలు**

**రాజాన సూర్యచంద్రకు పార్టీ షాక్..**

**ఫిర్యాదుల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నిర్ణయం**



అమరావతి(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీలో నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయ బాధ్యతల విషయంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబులకు అప్పగించారు. ఇప్పటివరకు నర్సీపట్నం పి.ఓ.సి.గా వ్యవహరిస్తున్న రాజాన సూర్యచంద్రను ఆ బాధ్యతల నుంచి తప్పించారు.

### ఫిర్యాదుల నేపథ్యంలో నిర్ణయం..

నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీ తరఫున సమన్వయ వ్యవహారాల నిర్వహణపై పార్టీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదులు అందినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే రాజాన సూర్యచంద్రను బాధ్యతల నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే, ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి వివరాలను పార్టీ వెల్లడించలేదు.

### ఇద్దరు ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలు

నర్సీపట్నం నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సమన్వయ బాధ్యతలను కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబులు నిర్వహించనున్నారు. జనసేన తరఫున ఎన్నికల సమన్వయ విధులను వీరిద్దరూ నిర్వర్తించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ స్పష్టం చేసింది.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నర్సీపట్నం నియోజకవర్గంలో పార్టీ సమన్వయాన్ని పటిష్ఠం చేయడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ఎన్నికల వ్యూహాలను అమలు చేయడం కీలకంగా మారనుంది.

# కొండపల్లిల నామినేషన్ల వేళ రగడ

- మూడు వార్డుల్లో నామినేషన్ల తిరస్కరణ.. కుల ధ్రువీకరణ పత్రంపై వివాదం
- రూ.1,500 చలానా కట్టించుకుని..- సర్టిఫికెట్ లేదని తిరస్కరించారంటూ అభ్యర్థి ఆగ్రహం




కొండపల్లి(ప్రశ్న న్యూస్) కొండపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ వివాదాలకు వేదికైంది. నామినేషన్ల పరిశీలనలో భాగంగా మూడు వార్డులకు చెందిన అభ్యర్థుల పత్రాలను అధికారులు తిరస్కరించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ముఖ్యంగా 26వ వార్డుకు చెందిన స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ మున్సిపల్ కార్యాలయం వద్ద వాగ్వాదానికి దారితీసింది. కుల ధ్రువీకరణ పత్రం సమర్పించలేదనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారులు చెబుతుండగా.. నామినేషన్ ఫీజు కింద రూ.1,500 చలానా కట్టించుకున్నప్పుడు ఈ విషయం ఎందుకు చెప్పలేదంటూ అభ్యర్థి నిలదీసినట్లు సమాచారం. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## 203 నామినేషన్లు.. 10 మంది చైర్మన్ అభ్యర్థులు!

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 203 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వారిలో 10 మంది మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేసేందుకు నామినేషన్లు సమర్పించారు. సోమవారం నిర్వహించిన పరిశీలన ప్రక్రియలో పత్రాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో మూడు వార్డులకు సంబంధించి నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు వెల్లడించారు.

## మూడు వార్డుల్లో తిరస్కరణ

నామినేషన్ల పరిశీలనలో భాగంగా తిరస్కరణకు గురైన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. 8వ వార్డు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన చింతల జ్యోతిర్మయి, షేక్ రేష్మ పేర్లతో సంబంధం ఉన్న నామినేషన్ విషయంలో అభ్యంతరం తలెత్తినట్లు సమాచారం. అయితే, ఇద్దరి పేర్లు ఉండటంతో నామినేషన్ తిరస్కరించారన్న అంశంపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.
19వ వార్డు: టీడీపీ రెబల్ అభ్యర్థి కోయ భవ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది.
26వ వార్డు: టీడీపీ రెబల్ అభ్యర్థి పీతా పద్మజ నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు సమాచారం.
అయితే, ఈ మూడు నామినేషన్ల తిరస్కరణకు సంబంధించి పూర్తి కారణాలను రిటర్నింగ్ అధికారులు వెల్లడించిన అధికారిక ఉత్తర్వులతో నిర్ధారించాల్సి ఉంది.

## కుల ధ్రువీకరణ పత్రంపై వివాదం

26వ వార్డుకు చెందిన ఓ స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ ప్రధాన చర్చకు దారితీసింది. నామినేషన్ దాఖలు చేసిన సమయంలో అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. సోమవారం నామినేషన్ల పరిశీలన సమయంలో సదరు అభ్యర్థి ఆ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొచ్చి సమర్పించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే, నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత కొత్తగా పత్రాలను సమర్పించేందుకు అనుమతించలేమని రిటర్నింగ్ అధికారి స్పష్టం చేస్తూ ఆ పత్రాన్ని స్వీకరించలేదని సమాచారం. దీంతో అభ్యర్థి, ఆయన అనుచరులు అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది.

## రూ.1,500 చలానా కట్టించుకున్నప్పుడు చెప్పలేదా?

నామినేషన్ తిరస్కరణపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభ్యర్థి.. నామినేషన్ ఫీజు కింద రూ.1,500 చలానా కట్టించుకున్న విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం.
"కుల ధ్రువీకరణ పత్రం లేకపోతే నామినేషన్ ఫీజు ఎందుకు కట్టించుకున్నారు? ముందుగానే ఈ విషయాన్ని ఎందుకు స్పష్టం చేయలేదు?" అంటూ ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. నామినేషన్ స్వీకరణ సమయంలో పత్రాల పరిశీలన ఎలా జరిగింది? అభ్యర్థికి అవసరమైన ధ్రువీకరణ పత్రం గురించి ముందుగానే వివరించారా? నామినేషన్ తిరస్కరణకు సంబంధించి ఏ నిబంధనను ప్రాతిపదికగా తీసుకున్నారు? అనే ప్రశ్నలు ఈ ఘటనతో తెరపైకి వచ్చాయి. అయితే, నామినేషన్ ఫీజు స్వీకరించడం మాత్రమే నామినేషన్ అర్హతను నిర్ధారించదు. సంబంధిత ఎన్నికల నిబంధనలు, నామినేషన్ పత్రాలు, రిటర్నింగ్ అధికారి ఇచ్చిన నిర్ణయం ఆధారంగానే ఈ అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

## మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

నామినేషన్ తిరస్కరణపై అభ్యర్థి, ఆయన అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో నిబంధనల అమలుపై అభ్యర్థుల్లో సందేహాలు తలెత్తకుండా అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇంద్రకీలాద్రిపై మహిషాసురమర్దిని వైభవం

కొండపై జగన్మాత దివ్యదర్శనం.. కొండ దిగువన భక్తిరస ప్రవాహం

భక్తులకు అన్నప్రసాదం..

వృద్ధులకు ప్రత్యేక సేవలు..

భద్రత, సౌకర్యాలపై అధికారుల పర్యవేక్షణ





విజయవాడ(ప్రశ్న న్యూస్) దుష్టశిక్షణ.. శిష్టరక్షణ.. ధర్మసంస్థాపన మహిషాసురుడి సంహారంతో ముల్లోకాలకు శాంతిని ప్రసాదించిన ఆదిపరాశక్తి శ్రీ మహిషాసురమర్దినిగా ఇంద్రకీలాద్రిపై దివ్యదర్శనమిస్తుండగా.. కొండ దిగువన భక్తి సంగీతం, నృత్యార్చనలు, వేదమంత్రాలు, నగరోత్సవాల ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. శరన్నవరాత్రుల తొమ్మిదో రోజైన మహానవమి సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధి భక్తజన సందోహంతో కళకళలాడింది. ఒకవైపు అమ్మవారి దర్శనం.. మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు.. ఇంకోవైపు ఆదిదంపతుల నగరోత్సవం.. ఇలా ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మికతకు చిరునామాగా మారింది.

## ముఖ్యాంశాలు.. ఆధ్యాత్మిక వైభవం!

మహిషాసురమర్దినిగా జగన్మాత: సింహవాహనంపై అష్టాదశ భుజాలతో దుష్టసంహారిణిగా కనకదుర్గమ్మ దివ్యదర్శనం. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు: క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, చిన్నారులకు పాలు, అన్నప్రసాదం, పారిశుధ్యంపై అధికారుల దృష్టి.
నాదనాట్యార్చన: భక్తి సంకీర్తనలు, హరికథ, కూచిపూడి, భరతనాట్యం, మహిషాసురమర్దిని స్తోత్ర నృత్యరూపకాలతో కళావేదికపై ఆధ్యాత్మిక సందడి.
ఆదిదంపతుల నగరోత్సవం: పంచవాద్యాల నడుమ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు.
భక్తులకు అన్నప్రసాదం: నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఉచిత అన్నప్రసాద పంపిణీ.
వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ: అలసటకు గురైన వృద్ధులకు తక్షణ ఉపశమనం కల్పించేలా సిబ్బంది సేవలు.
భద్రతకు ప్రాధాన్యం: సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా పరిస్థితుల పర్యవేక్షణ.
మహిషాసురమర్దినిగా అమ్మవారి దివ్యరూపం
మహానవమి పర్వదినాన శ్రీ కనకదుర్గమ్మ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సింహవాహనారూఢురాలై, అష్టాదశ భుజాల్లో ఆయుధాలు ధరించిన అమ్మవారి దివ్యస్వరూపం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ అలంకారం శక్తి ఆరాధనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
మహిషాసురుడి అహంకారాన్ని అణచి ధర్మాన్ని నిలబెట్టిన జగన్మాత రూపం భక్తుల్లో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. అమ్మవారిని దర్శించుకుని కుటుంబాల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సర్వశుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

# రాష్ట్రంలో ఏకగ్రీవాల జోరు

పలుచోట్ల పోటీలో లేని వైకాపా..

కూటమికి కలిసొచ్చిన నామినేషన్లు

పులివెందులలో పది వార్డులపై టీడీపీ ఆశలు..

కమలాపురం, మైదుకూరులోనూ ఏకపక్షమేనా.?



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో ఏకగ్రీవాలపై రాజకీయ ఉత్కంఠ నెలకొంది. పలు ప్రాంతాల్లో వైకాపా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకపోవడం, కొన్ని స్థానాల్లో ప్రత్యర్థుల కొరతతో కూటమి అభ్యర్థులకు ఏకగ్రీవ అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఏ స్థానాల్లో ఏకగ్రీవాలు ఖరారయ్యాయో స్పష్టత రానుంది. కడప జిల్లా నుంచి తిరుపతి వరకు పలు పురపాలక సంఘాల్లో ఇదే అంశం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.

## పులివెందులలో టీడీపీకి కొత్త ఆశలు..

కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీలో మొత్తం 40 వార్డులున్నాయి. ఇక్కడ వైకాపా నుంచి 30, టీడీపీ నుంచి 69 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి అంచనాల ప్రకారం టీడీపీ సుమారు పది వార్డుల్లో ఏకగ్రీవ విజయాలు సాధించే అవకాశం కనిపిస్తోంది. పులివెందులలో ఇలాంటి పరిస్థితి ఏర్పడితే స్థానిక రాజకీయాల్లో అది ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే తుది ఫలితం నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం తేలనుంది.

## కమలాపురంలో ఏకపక్ష పోరు.?

కమలాపురం మున్సిపాలిటీలో 23 వార్డులున్నాయి. చైర్‌పర్సన్ పదవితో పాటు వార్డులకు వైకాపా తరఫున నామినేషన్లు దాఖలు కాలేదని సమాచారం. దీంతో టీడీపీ అభ్యర్థులకు ఏకగ్రీవ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మైదుకూరు మున్సిపాలిటీలోనూ చైర్మన్ అభ్యర్థిగా వైకాపా నుంచి ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో అక్కడి చైర్మన్ స్థానం విషయంలోనూ కూటమికి అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎర్రగుంట్ల చైర్‌పర్సన్ పదవిని బీజేపీకి కేటాయించారు. తొలిరోజు ఒక వార్డులో మాత్రమే వైకాపా నామినేషన్ దాఖలైనట్లు, ఆ తర్వాత ఇతర వార్డుల్లో ఆ పార్టీ నుంచి నామినేషన్లు రాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీకి ఏకగ్రీవ అవకాశాలపై చర్చ సాగుతోంది.

## ఉపసంహరణల తర్వాతే తుది చిత్రం..

మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు కాకపోవడం ఒక్కటే ఏకగ్రీవ విజయానికి తుది ప్రాతిపదిక కాదు. నామినేషన్ల పరిశీలనలో అభ్యర్థుల అర్హతలు, తిరస్కరణలు, ఉపసంహరణల అనంతరం బరిలో మిగిలే అభ్యర్థుల సంఖ్య కీలకం కానుంది. ప్రత్యర్థులెవరూ లేకుండా ఒక్క అభ్యర్థి మాత్రమే మిగిలిన స్థానాల్లోనే ఏకగ్రీవ విజయం ఖరారవుతుంది.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు

- 16 విభాగాల్లో 120 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- రూ.15,600 నుంచి రూ.52,000 వరకు నెలవారీ వేతనం..

అక్టోబర్ 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జాతీయ ఆరోగ్య మిషన్, పట్టణ జాతీయ ఆరోగ్య మిషన్ తదితర ఆరోగ్య పథకాల కింద వివిధ విభాగాల్లో మొత్తం 16 రకాల పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన ఒప్పంద, బాహ్య సంస్థల ద్వారా నియామక పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## 16 విభాగాల్లో 120 పోస్టులు

నోటిఫికేషన్ ప్రకారం వైద్యాధికారులు, సిబ్బంది నర్సులు, సహాయక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధ నిపుణులు, వ్యాధుల పరిశీలన నిపుణులు, ప్రజారోగ్య నిర్వహణాధికారులు తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు. వైద్యాధికారులు 17, సిబ్బంది నర్సులు 32, సహాయక సిబ్బంది 8, సామాజిక ఆరోగ్య అధికారులు సహ వైద్యాధికారుల విభాగంలో 13, జిల్లా వ్యాధుల పరిశీలన నిపుణుడు 1, అసంక్రమిత వ్యాధుల విభాగంలో సిబ్బంది నర్సు 1, ఏఎన్ఎం ఆరోగ్య కార్యకర్తలు 8, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు 16, ఔషధ నిపుణులు 2, పట్టణ ఆరోగ్య మిషన్ సిబ్బంది నర్సులు 17 పోస్టులు ఉన్నాయి. అలాగే ప్రజారోగ్య నిర్వహణాధికారి 1, పాఠశాల వయస్సు పిల్లల ఆరోగ్య కార్యక్రమం కింద ఔషధ నిపుణుడు 1, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద సమన్వయకర్త 1, జిల్లా కేంద్ర ఔషధ విభాగంలో ఔషధ నిపుణుడు 1, చిన్న ఆరోగ్య కేంద్ర నిర్వహణాధికారి 1, చిన్న ఆరోగ్య కేంద్రంలో సహాయక సిబ్బంది 1 పోస్టును భర్తీ చేయనున్నారు.

## విద్యార్హతలు.. వేతనాల వివరాలు

వైద్యాధికారుల పోస్టులకు ఎంబీబీఎస్ పూర్తి చేసి తెలంగాణ వైద్య మండలిలో నమోదు చేసుకుని ఉండాలి. వీరికి నెలకు రూ.52,000 వేతనం చెల్లిస్తారు. సిబ్బంది నర్సుల పోస్టులకు నర్సింగ్‌లో పట్టా లేదా సంబంధిత డిప్లొమా పూర్తి చేసి, తెలంగాణ నర్సింగ్ మండలిలో నమోదు కలిగి ఉండాలి. వీరికి నెలకు రూ.29,900 వేతనం అందుతుంది. సహాయక సిబ్బంది పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత అవసరం. నెలకు రూ.15,600 వేతనం చెల్లిస్తారు. సామాజిక ఆరోగ్య అధికారులు, వైద్యాధికారుల విభాగంలో పోస్టులకు సంబంధిత వైద్య, ఆయుర్వేద లేదా నర్సింగ్ విద్యార్హతలు, అవసరమైన మండలి నమోదు ఉండాలి. అర్హతను బట్టి నెలకు రూ.29,900 లేదా రూ.40,000 వేతనం ఉంటుంది. జిల్లా వ్యాధుల పరిశీలన నిపుణుడి పోస్టుకు వైద్య విద్యతో పాటు ప్రజారోగ్యం, వ్యాధుల పరిశీలనకు సంబంధించిన ఉన్నత విద్యార్హతలు లేదా నోటిఫికేషన్‌లో పేర్కొన్న అనుభవం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.50,000 వేతనం నిర్ణయించారు. అసంక్రమిత వ్యాధుల విభాగంలోని సిబ్బంది నర్సు పోస్టుకు నర్సింగ్ అర్హతతో పాటు సంబంధిత మండలిలో నమోదు తప్పనిసరి. ఏఎన్ఎం పోస్టులకు సంబంధిత శిక్షణ, నమోదు అర్హతలు ఉండాలి. ఈ రెండు విభాగాల్లో వరుసగా నెలకు రూ.29,900, రూ.27,300 వేతనం చెల్లిస్తారు. ప్రయోగశాల సాంకేతిక నిపుణుల పోస్టులకు ఇంటర్మీడియట్‌తో పాటు వైద్య ప్రయోగశాల సాంకేతిక విద్యలో డిప్లొమా లేదా తత్సమాన అర్హత, సంబంధిత మండలిలో నమోదు అవసరం.
ఔషధ నిపుణుల పోస్టులకు ఔషధశాస్త్రంలో పట్టా లేదా డిప్లొమా, సంబంధిత ఫార్మసీ మండలిలో నమోదు ఉండాలి. ఈ పోస్టులకు నెలకు రూ.27,300 వేతనం చెల్లిస్తారు.
ప్రజారోగ్య నిర్వహణాధికారి పోస్టుకు సంబంధిత విభాగంలో పట్టభద్రతతో పాటు ప్రజారోగ్యం లేదా సామాజిక ఆరోగ్య నిర్వహణలో ఉన్నత విద్యార్హత, కనీసం రెండేళ్ల అనుభవం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.19,500 వేతనం నిర్ణయించారు. క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంలోని సమన్వయకర్త పోస్టుకు సామాజిక సేవ లేదా వ్యాపార నిర్వహణలో ఉన్నత విద్యార్హత, సంబంధిత రంగంలో కనీసం ఏడాది అనుభవం, ద్విచక్ర వాహనం నడపగల నైపుణ్యం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.26,410 వేతనం చెల్లిస్తారు. చిన్న ఆరోగ్య కేంద్ర నిర్వహణాధికారి పోస్టుకు ఆరోగ్య నిర్వహణలో వ్యాపార నిర్వహణ పట్టా లేదా సంబంధిత ఉన్నత విద్యార్హతతో పాటు ఆరోగ్య కార్యక్రమాల్లో కనీసం రెండేళ్ల అనుభవం అవసరం.
ఈ పోస్టుకు నెలకు రూ.30,000 వేతనం ఉంటుంది. జిల్లా కేంద్ర ఔషధ విభాగంలోని ఔషధ నిపుణుడి పోస్టుకు ఔషధశాస్త్రంలో డిప్లొమా, సంబంధిత మండలిలో నమోదు అవసరం. నెలకు రూ.27,300 వేతనం చెల్లిస్తారు.

## అక్టోబర్ 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 23 నుంచి అక్టోబర్ 28, 2026 వరకు కొనసాగుతుంది. ఆదివారం మినహా నిర్ణీత రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు రూ.500 రిజిస్ట్రేషన్ రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జతచేయాలి. డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పేరిట పొందాలి. విద్యార్హత ధ్రువపత్రాలు, సంబంధిత మండలి నమోదు ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలి.

## అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

నోటిఫికేషన్ సంఖ్య 286/E1/DMHO/MDCL/2026 కాగా, 2026 అక్టోబర్ 19న నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు నమూనా, అర్హతలు, ఎంపిక విధానం, ఇతర నిబంధనల కోసం అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
వెబ్‌సైట్: https://medchal-malkajgiri.telangana.gov.in
ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే సమయానికి అందుబాటులో ఉన్న ఖాళీలను బట్టి పోస్టుల సంఖ్య పెరగవచ్చు లేదా తగ్గవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు పూర్తి నోటిఫికేషన్‌ను జాగ్రత్తగా పరిశీలించి, తమ విద్యార్హతలకు అనుగుణమైన పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.

# చెప్పాం.. చేస్తున్నాం

## 27 నెలల్లో 90 శాతం హామీల అమలు

### టీడీపీ నేత ఎన్‌వీఎస్ఎస్ వర్మ



మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలు.. సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం.. ఇదే కూటమి ప్రభుత్వ పాలనా విధానమని టీడీపీ నేత ఎన్‌వీఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 27 నెలల పాలనలోనే 90 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందని తెలిపారు. ఆ ధైర్యంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## బీసీలకు అండగా కూటమి

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం కోర్టు కేసులతో అడ్డుకుందని వర్మ ఆరోపించారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు ముందుకు సాగుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికిపైగా సీట్లు కేటాయించడం సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి విశాఖపట్నం పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలతోపాటు విజయనగరం మేయర్ పదవులను బీసీ మహిళలకు కేటాయించడం ద్వారా మహిళా సాధికారతకు, బీసీల ప్రాతినిధ్యానికి ప్రాధాన్యమిచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించిన వర్మ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాల్లో సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఏలూరు మేయర్ పీఠమే లక్ష్యం..

**100 శాతం స్ట్రైక్‌రేట్‌పై జనసేన గురి**

**సామాన్య కార్యకర్తకు మేయర్ అభ్యర్థిగా అవకాశం**

**స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు**

**సిద్ధం చేసుకోవాలి: నాదెండ్ల మనోహర్**



ఏలూరు(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఏలూరు నగరపాలక సంస్థపై కూటమి పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంతోపాటు నగరంలోని 62 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రతి చోటా 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించడమే లక్ష్యం.. స్థానిక సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్లాలి అని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఏలూరులో సోమవారం నిర్వహించిన కూటమి పార్టీల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర అభివృద్ధి, ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల మధ్య సమన్వయం వంటి అంశాలపై నాయకులతో చర్చించారు. 2024 ఎన్నికల కంటే మెరుగైన మెజారిటీతో ఏలూరు మేయర్ పీఠాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## హమాలీ నుంచి మేయర్ అభ్యర్థి స్థాయికి..

సామాన్య స్థాయి నుంచి ఎదిగిన రెడ్డి అప్పలనాయుడును ఏలూరు మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై నాదెండ్ల మనోహర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. హమాలీ కూలీగా, కార్మిక సంఘాల నాయకుడిగా పనిచేసిన వ్యక్తికి ఈ స్థాయి అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. సామాన్య కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుంటారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి, వారికి పదవులు, బాధ్యతలు అప్పగించాలన్నది పవన్ కల్యాణ్ ఆకాంక్ష అని చెప్పారు. కూటమి పార్టీల మధ్య కార్పొరేటర్ టికెట్ల కేటాయింపుపై స్పష్టత ఉందని, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

## 22-ఏ భూముల పరిష్కారానికి శ్రీకారం

ఏలూరు జిల్లా అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనలో రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందని మనోహర్ పేర్కొన్నారు. 22-ఏ భూముల సమస్య పరిష్కారానికి ఏలూరులోనే శ్రీకారం చుట్టామని తెలిపారు. త్వరలో 22-సీ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా మార్గాలను అన్వేషిస్తామని వెల్లడించారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళు‌న్నామని, స్థానిక సంస్థల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను విస్తరించేందుకు ఎన్నికల్లో విజయం దోహదపడుతుందని ఆయన అన్నారు. నగర ప్రజల ఆశీర్వాదంతో ఏలూరును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి కృషి చేస్తుందని తెలిపారు.జనసేన మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుతోపాటు 62 డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రతి డివిజన్‌కు ప్రత్యేక ప్రణాళిక

అంతకుముందు ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో జనసేన తరఫున పోటీ చేస్తున్న 18 డివిజన్ల అభ్యర్థులతో నాదెండ్ల మనోహర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎన్నికల కార్యాచరణపై పలు సూచనలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తమ డివిజన్‌లోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలతో మమేకమై, తాము గెలిస్తే స్థానిక సమస్యలను ఎలా పరిష్కరిస్తామో వివరించాలని చెప్పారు.ప్రజల్లోకి వెళ్లడం మాత్రమే కాదు.. వారి సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించాలి. ప్రతి డివిజన్‌కు ప్రత్యేక కార్యాచరణ ఉండాలి. పోటీ చేస్తున్న ప్రతి చోటా విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలి అని దిశానిర్దేశం చేశారు.

## పార్టీ నీడే కార్యకర్తలకు శ్రీరామరక్ష

జనసేన పార్టీని ఈ స్థాయికి తీసుకురావడానికి పవన్ కల్యాణ్ ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నారని మనోహర్ పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు."పార్టీ తల్లి లాంటిది. ఆ నీడ మనకు శ్రీరామరక్ష. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన పనిచేస్తుంది. పవన్ కల్యాణ్ ఆశయాలను నిలబెట్టుకోవడానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా ఐక్యంగా పనిచేసి ప్రజల మద్దతు పొందాలి" అని పిలుపునిచ్చారు.

## కూటమి నేతల సమక్షంలో వ్యూహరచన

ఈ సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, కూటమి నాయకులు కిషోర్, అంబికా కృష్ణ, నారా శేష తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు మేయర్ బరిలో 19 నామినేషన్లు

**20 దరఖాస్తుల్లో ఒకటి తిరస్కరణ..**

**21న ఉపసంహరణలతో తుది చిత్రం**



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. మేయర్ అభ్యర్థులుగా మొత్తం 20 నామినేషన్లు దాఖలు కాగా, సోమవారం నిర్వహించిన పరిశీలనలో ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. మిగిలిన 19 నామినేషన్లు అర్హత పొందినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో మేయర్ ఎన్నికల బరిలో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నిలిచారు.

## పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు ఇవీ..

నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన అభ్యర్థుల వివరాలను నగరపాలక సంస్థ అధికారులు వెల్లడించారు.ఎన్నికల నిబంధనలు--2005 ప్రకారం అర్హత పొందిన నామినేషన్ల జాబితాను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ప్రచురించినట్లు వెల్లడించారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు.

## ఉత్కంఠ రేపుతున్న మేయర్ ఎన్నిక..

నామినేషన్ల పరిశీలన పూర్తవడంతో గుంటూరు మేయర్ ఎన్నికల ప్రక్రియ మరో కీలక దశకు చేరింది. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత ఎంతమంది అభ్యర్థులు తుది పోటీలో నిలుస్తారనేది స్పష్టం కానుంది. ప్రధాన పార్టీలతోపాటు ఇతర రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండటంతో ఎన్నికల ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

# భక్తితో అన్నదానం.. సేవలో ఆదర్శంగా కుటుంబం

**- 41 రోజులుగా గడిమైసమ్మ ఆలయంలోమణికంఠ ఆధ్వరాయంలో అన్నదానం - కీర్తిశేషులురాజేశ్వర్ గౌడ్ (చిలకరాజు )కూతురు - ఈరోజు సంతోషిని చేతులమిదిగా అన్నం ఒడ్డించారు**

**- భక్తులకు అన్నప్రసాద వితరణ.. సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కుటుంబం - భవానీ మాలధారులకే కాదు.. మాల ధరించని భక్తులకూ అన్నదానం**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)భక్తి, సేవాభావం, దాతృత్వం కలగలిసిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి మేడ్చల్‌లోని శ్రీశ్రీ గడిమైసమ్మ అమ్మవారి దేవాలయం వేదికగా నిలుస్తోంది. అమ్మవారి ఆశీస్సులతో భవానీ దీక్ష చేపట్టిన భక్తులకు, ఆలయానికి వచ్చే ఇతర భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవాభావాన్ని చాటుకుంటున్నారు. గత 41 రోజులుగా కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం భక్తులలో సంతోషాన్ని నింపుతోంది.మేడ్చల్ మాజీ సర్పంచ్ సుధా రాజేశ్వర్ గౌడ్ (చిలక రాజు) కుటుంబం అమ్మవారి సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 19 వరకు అన్నదాన సేవ కొనసాగడం విశేషం. భవానీ మాల ధరించిన భక్తులతో పాటు మాల ధరించని వారికి కూడా అన్నప్రసాదం అందిస్తూ, అన్నదానానికి ఎలాంటి భేదభావాలు ఉండవని చాటుతున్నారు.

## కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమం

కుటుంబ పెద్దలు చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని, తరువాతి తరాలు కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని పలువురు భావిస్తున్నారు. సంతోషిని చేతుల మీదుగా అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ తండ్రి చూపిన మార్గంలోనే కుటుంబ సభ్యులు కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండటం సంతోషంగా ఉందని పేర్కొంటూ, ఈ సేవను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కుటుంబ సభ్యుడు మంకంఠ గౌడ్ కూడా భవానీ దీక్షలో ఉన్న మాలధారులకు, మాల ధరించని భక్తులకు అన్నదానం అందిస్తూ సేవా కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచారు.

## అన్నదానమే మహాదానం

ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో అన్నదానానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆకలితో వచ్చినవారికి అన్నం పెట్టడం, భక్తులకు ఆహారం అందించడం గొప్ప సేవగా భావిస్తారు. దేవాలయాల్లో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజంలో మానవత్వం, ఐక్యత, పరస్పర సహకారం



వంటి విలువలను బలపరుస్తాయి. శ్రీశ్రీ గడిమైసమ్మ అమ్మవారి ఆలయంలో 41 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. భక్తి అనేది పూజలకే పరిమితం కాకుండా, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా కూడా వ్యక్తమవుతుందని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.

# చెడుపై మంచి సాధించిన విజయం..

# దసరా ధర్మానికి ప్రతీక విజయదశమి

**పాలపిట్ట దర్శనంలో నమ్మకం.. జమ్మి పూజలో ఆత్మీయత.. ఆడపడుచుల సందడితో తెలంగాణలో ప్రత్యేకమైన పండుగ**

**(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న)**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరా పండుగకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని జరుపుకుంటారు. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించి, పదో రోజున విజయదశమిని ఘనంగా నిర్వహిస్తారు. భక్తి, శక్తి, ధైర్యం, విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ దేశవ్యాప్తంగా వివిధ సంప్రదాయాలతో జరుపుకుంటారు.

## మహిషాసురుడిపై దుర్గాదేవి విజయం

దసరా పండుగ వెనుక ప్రధానంగా దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన కథ ప్రాచుర్యంలో ఉంది. మహిషాసురుడి దురాగతాలను అంతం చేసేందుకు దేవతల శక్తులన్నీ ఏకమై ఆదిశక్తి రూపమైన దుర్గాదేవి అవతరించిందని పురాణాలు చెబుతాయి. తొమ్మిది రోజుల పాటు జరిగిన యుద్ధం అనంతరం పదో రోజున అమ్మవారు మహిషాసురుడిని సంహరించి లోకాలకు శాంతిని ప్రసాదించిందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ పండుగను విజయదశమిగా జరుపుకుంటారు. మరోవైపు, రామాయణ సంప్రదాయం ప్రకారం శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించిన రోజుగా కూడా విజయదశమికి ప్రాధాన్యం ఉంది. ఈ రెండు కథలు చెడును ఎదుర్కొని మంచి, న్యాయం, ధర్మం విజయం సాధిస్తాయనే సందేశాన్ని అందిస్తాయి.

## తెలంగాణలో దసరా ప్రత్యేకత

తెలంగాణలో దసరా పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. బతుకమ్మ ఉత్సవాలతో ప్రారంభమయ్యే పండుగ సందడి విజయదశమి వరకు కొనసాగుతుంది. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు కొత్త దుస్తులు ధరించి, ఆలయాలను సందర్శించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకుంటారు. పండుగ సందర్భంగా ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయ పనులు చేసే చాలామంది తమ సొంతూళ్లకు చేరుకుంటారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకుంటారు. ఆడపడుచులను ఇంటికి ఆహ్వానించడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం, బంధుత్వాలను బలోపేతం చేసుకోవడం తెలంగాణ పల్లెల్లో కనిపించే ఆత్మీయ సంప్రదాయాలు.

## పాలపిట్ట దర్శనం వెనుక నమ్మకం ఏమిటి?

తెలంగాణలో విజయదశమి రోజున పాలపిట్టను చూడటానికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. పాలపిట్ట దర్శనం శుభసూచకమని, విజయాన్ని అందిస్తుందని ప్రజల్లో తరతరాలుగా ఒక నమ్మకం కొనసాగుతోంది. పండుగ రోజున పాలపిట్టను చూసి శుభం కలగాలని కోరుకుంటారు.అయితే, పాలపిట్ట





దర్శనం భవిష్యత్తులో విజయం తప్పకుండా వస్తుందని నిర్ధారించే విషయం కాదు. ఇది తెలంగాణ ప్రజల సాంస్కృతిక విశ్వాసానికి, పండుగ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.

## జమ్మి ఆకుల్లో బంగారం.. ఆత్మీయతకు చిరునామా

విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంధుమిత్రులకు ఇచ్చుకోవడం తెలంగాణలో విస్తృతంగా కనిపించే సంప్రదాయం. జమ్మి ఆకులను బంగారానికి ప్రతీకగా భావించి ఒకరికొకరు ఇచ్చుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తారు.కేవలం ఆకులను ఇచ్చుకోవడమే కాకుండా, మనసులోని విభేదాలను పక్కనపెట్టి ఆప్యాయతను పంచుకోవడం, బంధాలను బలపరచుకోవడం ఈ సంప్రదాయం వెనుక ఉన్న అంతరార్థంగా భావిస్తారు. కొందరు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పెద్దల వద్దకు వెళ్లి జమ్మి ఆకులు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

## ఆయుధ పూజ.. పనిముట్లకు గౌరవం

విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ, వాహన పూజ,



పనిముట్ల పూజ నిర్వహించడం కూడా అనేక ప్రాంతాల్లో ఆనవాయితీగా ఉంది. రైతులు వ్యవసాయ పనిముట్లను, కార్మికులు తమ వృత్తికి సంబంధించిన పరికరాలను, వ్యాపారులు తమ వ్యాపార సామగ్రిని పూజిస్తారు. వాహనాలను శుభ్రం చేసి పూజలు నిర్వహిస్తారు.మన జీవనోపాధికి తోడ్పడే సాధనాలను గౌరవించాలనే భావన ఈ ఆచారంలో కనిపిస్తుంది. కొత్త పనులు ప్రారంభించడానికి, వ్యాపారాలు మొదలుపెట్టడానికి, విద్యా సంబంధిత కార్యక్రమాలు చేపట్టడానికి విజయదశమి శుభదినంగా భావించే వారూ ఉన్నారు.

## పండుగలో దాగి ఉన్న అసలైన సందేశం

దసరా అంటే కేవలం పూజలు, కొత్త దుస్తులు, పండుగ వంటకాలకే పరిమితమైన వేడుక కాదు. మనిషిలోని అహంకారం, అసూయ, కోపం, ద్వేషం వంటి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని ఈ పండుగ గుర్తుచేస్తుంది. రావణుడిని సంహరించిన శ్రీరాముడు, మహిషాసురుడిని అంతం చేసిన దుర్గాదేవి కథలు ధర్మం కోసం నిలబడటం, అన్యాయాన్ని ఎదిరించడం, ధైర్యంగా ముందుకు సాగడం వంటి విలువలను తెలియజేస్తాయి. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా నమ్మకంతో, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాన్ని సాధించవచ్చనే స్ఫూర్తిని అందిస్తాయి.

# చెప్పాం.. చేస్తున్నాం.. ఇదే కూటమి నినాదం

**అనపర్తిలో అభివృద్ధి, సంక్షేమమే అజెండా**

**రెండేళ్లలో రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం**

**: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

అనపర్తి (ప్రశ్న న్యూస్) ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా కూటమి పార్టీలన్నీ సమన్వయంతో ఎదుర్కొంటాయని స్పష్టం చేశారు. అనపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో 'చెప్పాం.. చేస్తున్నాం' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో కూటమి ఏకతాటిపైకి వచ్చి విజయం సాధించినట్లుగానే, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఐకమత్యంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు రహదారుల నిర్మాణం వేగంగా సాగుతోందని, కేంద్రం సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు.

## సంక్షేమానికి పెద్దపీట

సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నామని రామకృష్ణారెడ్డి తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా రెండు సంవత్సరాల్లో రూ. 20,210 కోట్లు ఖర్చు చేసి 67.47 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిగిలిన బకాయిలను చెల్లించడంతో పాటు అభివృద్ధి పనులకూ నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.



## బీసీలకు సామాజిక న్యాయం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సంబంధిత కమిషన్ ద్వారా సర్వే నిర్వహించి, న్యాయస్థానాల తీర్పులు, నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## స్వర్ణకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**రామాయంపేట** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ చారి ఆధ్వర్యంలో స్వర్ణకారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ నెల 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న స్వర్ణకార సభ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ స్వర్ణకారుల వృత్తి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు.స్వర్ణకారులకు సంబంధించిన జీవో 272ను సవరించాలని అక్రమ రికవరీలను అరికట్టాలని పేర్కొన్నారు.50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ అందించాలని తెలిపారు.అలాగే అన్ని బ్యాంకుల్లో పనిచేస్తున్న అప్రైజర్లకు విధించిన సీలింగ్ విధానాన్ని తొలగించి సమానమైన కమిషన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.స్వర్ణకారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 24న సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న స్వర్ణకార శంఖారావం బహిరంగ సభకు మెదక్ జిల్లాలోని స్వర్ణకార సంఘాల నాయకులు స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి నెమలి శ్రీనివాస్ చారి రాష్ట్ర పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కృష్ణాపురం రామకృష్ణ చారి స్వర్ణకార సంఘం కార్యదర్శి సరాఫ్ ప్రశాంత్ చారి పట్టణ స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు పూన రవీంద్ర చారి కోశాధికారి మైలవరం వేణుమాధవ్ చారి సహాయక కార్యదర్శి కిరణ్ చారి సహాయ ఉపకోశాధికారి వరుణ్ చారి మద్దూరి నవీన్ చారి సీనియర్ సభ్యులు వంగాల ముకుందా చారి వనపర్తి రమేష్ చారి నక్క నరేందర్ చారి రాయరపు శంకర్ చారి రాయరపు నాగరాజు చారి యాడారం రమేష్ చారి వనపర్తి ఆంజనేయులు చారి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో వైద్య సేవలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆరా

**– సమయపాలన పాటిస్తూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి - డాక్టర్ వెంకట రమణ**



**సి.బెళగల్** :కర్నూలు జిల్లా సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణ సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇన్‌పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఆసుపత్రిలోని నవజాత శిశు సంరక్షణ గది, మందుల విభాగం, ప్రయోగశాల (ల్యాబ్)లను పరిశీలించారు. రికార్డులు, నివేదికలు, రిజిస్టర్లను తనిఖీ చేసి, వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రోగులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గర్భిణులు, చిన్నారులకు సంబంధించిన ఆరోగ్య వివరాలు, వారికి అందిస్తున్న సేవలను వంద శాతం ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సి.బెళగల్ వైద్యాధికారి డాక్టర్ మిథున్ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

## వనపర్తిలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ.

**– ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి.**

**వనపర్తి** .అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.వనపర్తి పట్టణం మరియు రాజనగరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, వివిధ ప్రమాదాలు, ఇతర కారణాలతో మృతి చెందినవారి కుటుంబాలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సోమవారం పరామర్శించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడంతో పాటు, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వనపర్తి పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సాక్షి రిపోర్టర్ రాజు భార్య జి. సంధ్య గుండె సంబంధిత వ్యాధితో శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆమెను ఎమ్మెల్యే పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను అండగా ఉంటానని రాజు కి భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణంలోని 5వ వార్డుకు చెందిన నరసింహ కుమారుడు రవి మృతి చెందడంతో వనపర్తి జిల్లా ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.13వ వార్డుకు చెందిన రాజారెడ్డి గారు గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదే వార్డుకు చెందిన కురుమయ్య కుమారుడు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో స్థానిక కౌన్సిలర్ పరుశురాముతో వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా ఇటీవల నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దాండియా కార్యక్రమం సందర్భంగా లైటింగ్ నిర్మాణం ప్రమాదవశాత్తు కూలిపోవడంతో మృతి చెందింది.ఆమె మృతదేహాన్ని వనపర్తిలోని నివాసానికి తీసుకురావడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి, సోనా మృతదేహానికి నివాళులర్పించారు.అనంతరం రాజనగరంలో గుండేటి సురేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.రాజనగరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొడుగు వెంకటయ్య ముదిరాజ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వెంకటేష్, అరుణ బ్రహ్మచారి, పాకనాటి కృష్ణయ్య, బి కృష్ణయ్య, ఏర్పుల రవి, రాజు, రఘు యాదవ్, పరుశురాములు, పాల రవి, మైనార్టీ నాయకులు బషీర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఘనంగా దసరా వేడుకలు

**కరీంనగర్** కమిషనరేట్ కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు దసరా పండగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ , జమ్మి మరియు వాహన పూజా కార్యక్రమాల్లో పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ. కమిషనరేట్ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కమిషనరేట్ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ రిజర్వు ఇన్స్పెక్టర్లు జానీమియా, శ్రీధర్ రెడ్డి , కిరణ్ కుమార్ లతో పాటు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో గిరులన్నీ పులకింత

# స్వర్ణరథంపై శ్రీనివాసుడు..

**అశ్వవాహనంపై కల్కి నారాయణుడు**

**తిరుమాడ వీధుల్లో కనువిందు చేసిన**

**మలయప్పస్వామి దివ్య వైభవం**





తిరుమల(ప్రశ్న న్యూస్) అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి నామస్మరణతో శేషాచలం పులకించింది. మంగళవాయిద్యాల మధురనాదాలు.. గజరాజుల గంభీర నడకలు.. కర్పూర హారతుల వెలుగులు.. భక్తుల జయజయధ్వానాలు.. ఒకవైపు బంగారు రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా విహరించిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ మలయప్పస్వామి.. మరోవైపు రాత్రి అశ్వవాహనంపై కల్కి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు! తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదో రోజు భక్తిభావానికి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. స్వామివారి వాహనసేవలను తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనం గోవింద నామస్మరణతో తిరుమాడ వీధులను మార్మోగించారు. మరోవైపు బ్రహ్మోత్సవాల ముగింపు ఘట్టమైన చక్రస్నానానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

**స్వర్ణరథంపై స్వామి.. కనుల పండువగా దివ్య విహారం**

బంగారు కాంతులతో మెరిసే స్వర్ణరథం.. అందులో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి.. చుట్టూ మంగళవాయిద్యాల నాదం.. అడుగడుగునా భక్తుల గోవింద నామస్మరణ! సోమవారం ఉదయం 7 గంటలకు తిరుమలలో నిర్వహించిన స్వర్ణరథోత్సవం అద్భుత ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది.స్వర్ణాభరణాల శోభతో విరాజిల్లిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమాడ వీధులకు చేరుకున్నారు. మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని స్వర్ణరథాన్ని లాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తిశ్రద్ధలతో రథాన్ని ముందుకు నడిపిస్తూ శ్రీనివాసుడి నామాన్ని స్మరించారు. కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా దర్శించుకున్నారు.స్వర్ణరథోత్సవాన్ని దర్శించుకుంటే శ్రీమహాలక్ష్మి కటాక్షంతో సంపదలు, భూదేవి అనుగ్రహంతో ధాన్యసంపదలు, శ్రీ వేంకటేశ్వరస్వామి కృపతో సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. స్వర్ణరథంపై విహరించిన స్వామివారి దివ్యరూపం భక్తుల హృదయాల్లో భక్తి పారవశ్యాన్ని నింపింది.

**అశ్వవాహనంపై కల్కి నారాయణుడు**

ఉదయం స్వర్ణరథంపై కనువిందు చేసిన మలయప్పస్వామి.. రాత్రి అశ్వవాహనంపై కల్కి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు రాత్రి నిర్వహించిన ఈ వాహనసేవ ధర్మరక్షణ, దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనే సనాతన ధర్మ సందేశాన్ని చాటింది.గజరాజుల గంభీర నడకలు.. మంగళవాయిద్యాల హోరు.. జీయ్యంగార్ల ఘోష.. భక్తజనుల భజనలు, కోలాటాలు.. కర్పూర హారతుల మధ్య అశ్వవాహనసేవ వైభవంగా సాగింది. అశ్వవాహనంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అడుగడుగునా హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణ చేశారు. స్వర్ణరథంపై సాక్షాత్కారం.. అశ్వవాహనంపై ధర్మసందేశం.. చక్రస్నానంతో బ్రహ్మోత్సవాల పరిపూర్ణత! గోవింద నామస్మరణతో శేషాచలం మరోసారి భక్తి సాగరంగా మారింది.

# సిద్ధిదాయినీ కటాక్షం.. శ్రీశైలంలో ఆధ్యాత్మిక వైభవం

**– మహర్నవమి వేళ భ్రమరాంబమ్మకు విశేష పూజలు - కైలాస వాహనంపై స్వామిఅమ్మవార్ల విహారం**





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) మంత్రాక్షరాల మధురనాదం.. వేదఘోషల గంభీరత.. భక్తిపారవశ్యంతో పులకించిన భక్తజనం.. అమ్మవారి నామస్మరణతో మార్మోగిన శ్రీశైల క్షేత్రం! శ్రీ భ్రమరాంబికాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మహర్నవమి వేళ ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్నాయి. నవదుర్గలలో చివరి స్వరూపమైన సిద్ధిదాయినీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా, ప్రత్యేక పూజలు, చండీహోమాలు, రుద్రయాగాలు, కుమారీ పూజలతో ఆలయ ప్రాంగణం భక్తి భావనలో మునిగిపోయింది. మరోవైపు శ్రీ స్వామిఅమ్మవార్ల కైలాస వాహనసేవ, సాయంత్రం నిర్వహించిన ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**సిద్ధులనిచ్చే సిద్ధిదాయినీ.. అమ్మవారి దివ్య అలంకారం..**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ భ్రమరాంబికాదేవి ఉత్సవమూర్తిని సిద్ధిదాయినీ స్వరూపంలో అలంకరించారు. చతుర్భుజాలతో విరాజిల్లే అమ్మవారు కుడివైపు చక్రం, గద.. ఎడమవైపు శంఖం, పద్మాలను ధరించిన రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అణిమ, మహిమ, గరిమ, లఘిమ తదితర అష్టసిద్ధులను ప్రసాదించే దేవతగా సిద్ధిదాయినీ అమ్మవారిని భక్తులు ఆరాధిస్తారు. సర్వదేవతలు, యక్షులు, గంధర్వులు సైతం సేవించే దివ్యశక్తిగా పురాణాలు వర్ణించే ఈ అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

**చండీహోమం.. రుద్రయాగంతో ఆధ్యాత్మిక శోభ**

మహర్నవమి సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణాలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలతో పాటు చండీ పారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీ పూజలు జరిపించారు. రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు. సాయంత్రం కూడా జపాలు, పారాయణాలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం వంటి విశేష క్రతువులు కొనసాగనున్నాయి. విజయదశమి వేడుకలతో మరోసారి భక్తి వైభవాన్ని చాటేందుకు సిద్ధమవుతోంది. చండీహోమాలు, వేదపారాయణలు, వాహనసేవలు, సంప్రదాయ కళారూపాల నడుమ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల దివ్యక్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతోంది. శక్తి ఆరాధనకు ప్రతీకగా నిలిచే శరన్నవరాత్రులు.. విజయదశమి వేడుకలతో సంపూర్ణతను సంతరించుకోనున్నాయి.

## రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానంపై ఆసక్తికర చర్చ

**– ముగ్గురు నేతల పేర్లతో సాగుతున్న ప్రచారం..**

**– అధికారిక ప్రకటనల కోసం ఎదురుచూపు**

**రాజవొమ్మంగి:** రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానం చుట్టూ రాజకీయ చర్చ మొదలైంది. రానున్న ఎన్నికల్లో కూటమి తరపున మఠం విజయభాస్కర్, సీపీఎం తరపున గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు, వైసీపీ తరపున కొంగర మురళీకృష్ణ పోటీ చేయనున్నారంటూ స్థానికంగా, సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం జరుగుతోంది.అయితే, ఈ ముగ్గురి అభ్యర్థిత్వంపై సంబంధిత పార్టీల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానానికి ఎవరెవరు బరిలో నిలుస్తారనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. అధికారిక ప్రకటనలు వెలువడిన తర్వాతే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

## మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు వాయిదా

**కడప** మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. కలెక్టర్ నివేదిక ఆదారంగా ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. నామినేషన్ సెంటర్లలో అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చించినట్టు సిసి ఫుటేజీలు నిర్ధారించాయి. నామినేషన్ పత్రల పరిశీలన చేయడానికి వీలుకాదని ఎన్నికల కమిషన్ కు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రిపోర్టు రాసారు. కలెక్టర్ రిపోర్టర్ ను బేస్ చేసుకుని ఎన్నికలను ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది.

## ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి నామినేషన్

**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా నవీన్ కుమార్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు.పట్టణ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లక్ష్యంగా ఆయన చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు.ఎమ్మిగనూరు పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మున్సిపల్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేయాలన్నది తన లక్ష్యమని నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపడం, మున్సిపల్ పరిపాలనలో ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన భావిస్తున్నారు.స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ సమర్పించిన నవీన్ కుమార్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు మెరుగైన పౌర సేవల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ తన ముందడుగు వేశారు.

## విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి

**– జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల** విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్మ్డు రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు.. ముగ్గురు అరెస్టు

**జైపూర్** నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పులు జరిపిన ముగ్గురిని పోలీసులు రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసారు. నిందితుల్లో ఇద్దరు హర్యానాకు, మరొకరు బీహార్‌కు చెందినట్లుగా గుర్తించారు. ఈ నిందితులకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ష్రాఫ్‌పై కాల్పులు జరిపింది.. ప్రొఫెషనల్ షూటర్లేనని మీడియాకు అధికారులు తెలిపారు. కాల్పులకు ముందు నటుడి కదిలికలను రెక్కీ చేసి.. దాడి నిర్వహించినట్లు సమాచారం. టైగర్ ప్రతి ఆదివారం జుహు ఫుట్‌బాల్ గ్రౌండ్‌కి వెళ్తాడని తెలుసుకున్న దుండగులు, అక్కడి నుంచి కారులో తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కాల్పులు జరిసారు. తర్వాత అంధేరి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద బైక్ వదిలి.. బోరివలి వైపు వెళ్లే ట్రైన్ ఎక్కారు. ఆపై మహారాష్ట్ర సరిహద్దు దాటి, గుజరాత్‌లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. అక్కడి నుంచి రాజస్థాన్‌లోని కోటాకు రైలులో వెళ్లగా, పోలీసులు స్టేషన్‌లో పట్టుకున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**కరీంనగర్** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సోమవారం కల్లా శాఖల లాగిన్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని.. ఈ లోగా అధికారులు లాగిన్ లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సూపరింటెనీడెంట్లు కాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు రోజుల్లోనే రూ.400 కోట్ల క్లబ్‌లోకి రజనీ.. ఓవర్సీస్‌లో 'ధురంధర్ 2' రికార్డు బద్దలు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.424.25 కోట్ల వసూళ్లు సాధించింది. దీంతో రూ.400 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మరోవైపు 2026లో భారతీయ సినిమాల్లో ఓవర్సీస్ తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ క్రమంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'ను వెనక్కి నెట్టింది.ఆదివారం ఒక్కరోజే 'జైలర్ 2' భారత్‌లో రూ.55.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. శనివారం వచ్చిన రూ.47.25 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు 18.2 శాతం పెరిగాయి. విడుదలైన తొలి రోజు రూ.59.70 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. రెండో రోజు రూ.37.10 కోట్లకు పరిమితమైంది. ఆ తర్వాత వారాంతంలో మళ్లీ పుంజుకుంది.ఇప్పటివరకు భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ.199.90 కోట్లకు చేరాయి. పన్నులతో కలిపిన దేశీయ వసూళ్లు రూ.234.25 కోట్లు కాగా.. విదేశాల్లో రూ.190 కోట్లు రాబట్టింది. దీంతో ప్రపంచవ్యాప్త వసూళు రూ.424.25 కోట్లకు చేరినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి.విదేశీ మార్కెట్లో తొలి రోజు వసూళ్లలో 'జైలర్ 2' సుమారు రూ.57 కోట్లు సాధించింది. 'ధురంధర్ 2' తొలి రోజు రాబట్టిన రూ.52 కోట్లను అధిగమించింది. ఈ జాబితాలో రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' రూ.28 కోట్లతో మూడో స్థానంలో ఉంది.

విజయ్ 'జన నాయగన్' రూ.27.50 కోట్లు, మలయాళ చిత్రం 'దృశ్యం 3' రూ.25 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.ఆదివారం వసూళ్లలో తమిళ వెర్షన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ భాషలో రూ.39.95 కోట్ల నెట్ వసూళ్లు వచ్చాయి. తెలుగు వెర్షన్ రూ.9.50 కోట్లు, హిందీ వెర్షన్ రూ.5.75 కోట్లు, కన్నడ వెర్షన్ రూ.65 లక్షలు రాబట్టాయి. అన్ని భాషల్లో కలిపి 15,473 ప్రదర్శనలకు సగటున 62 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది.నాలుగు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన 'జైలర్ 2'కు ఇప్పుడు అసలు పరీక్ష మొదలుకానుంది. వారాంతపు జోరును వారం మధ్యలోనూ కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

# ఈ సినిమా వల్ల ప్రపంచానికి తెలిశాను




ఏపీకి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన సినిమా 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్ పోషించిన ఈ సినిమాకు గౌరినాయుడు జమ్ము దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాతలు. ఇటీవలే విడుదలైన ఈసినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గాయని గరివిడి లక్ష్మి మాట్లాడుతూ 'బుర్రకథ వల్ల తెలుగు రాష్ట్రాల్లో నాకు పేరుంది.కానీ ఈ సినిమా వల్ల నేను ప్రపంచానికి తెలిశాను. ఈ దర్శక,నిర్మాతలకు నా కథను సినిమాగా తీయాలని ఎందుకు అనిపించిందో తెలియదు. నా జీవితాన్ని తెరపై చూస్తుంటే చెప్పలేనంత ఆనందంగా అనిపించింది' అని సంతోషం వెలిబుచ్చారు. ఈ సినిమా తన జీవితానికే ప్రత్యేకమైనదని నటి ఆనంది తెలిపారు. ఇంకా నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్, దర్శకుడు గౌరీ నాయుడు, నటులు రాగ్ మయూర్, అంకిత్ కొయ్య, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ కూడా మాట్లాడారు.



# రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా

నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం'' అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్స్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.





# ఈ సినిమా వల్ల ప్రపంచానికి తెలిశాను

ఏపీకి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన సినిమా 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్ పోషించిన ఈ సినిమాకు గౌరినాయుడు జమ్ము దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాతలు. ఇటీవలే విడుదలైన ఈసినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గాయని గరివిడి లక్ష్మి మాట్లాడుతూ 'బుర్రకథ వల్ల తెలుగు రాష్ట్రాల్లో నాకు పేరుంది. కానీ ఈ సినిమా వల్ల నేను ప్రపంచానికి తెలిశాను. ఈ దర్శక,నిర్మాతలకు నా కథను సినిమాగా తీయాలని ఎందుకు అనిపించిందో తెలియదు. నా జీవితాన్ని తెరపై చూస్తుంటే చెప్పలేనంత ఆనందంగా అనిపించింది' అని సంతోషం వెలిబుచ్చారు. ఈ సినిమా తన జీవితానికే ప్రత్యేకమైనదని నటి ఆనంది తెలిపారు. ఇంకా నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్, దర్శకుడు గౌరీ నాయుడు, నటులు రాగ్ మయూర్, అంకిత్ కొయ్య, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ కూడా మాట్లాడారు.


# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో భారీ సాంగ్..

**రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేక సెట్, ఫ్లాష్‌బ్యాక్‌పై ఆసక్తికరమైన టాక్!**



యంగ్ టైగర్ ఎన్టీఆర్, యాక్షన్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'డ్రాగన్'. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అందరిలోనూ ఉంది. ఈ నేపథ్యంలో సినిమా షూటింగ్‌కు సంబంధించిన తాజా సమాచారం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. కొంతకాలం విరామం తర్వాత ఎన్టీఆర్ అక్టోబర్ 15న 'డ్రాగన్' షూటింగ్ సెట్‌లోకి తిరిగి అడుగుపెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఎన్టీఆర్ వంటి అద్భుతమైన నటుడితో ఆయన ఎలాంటి యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు సినిమాలోని ఇతర ప్రధాన తారాగణం కూడా పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. కథలో కీలకమైన సన్నివేశాలను పూర్తి చేసే పనిలో చిత్ర బృందం నిమగ్నమైందని సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ పూర్తయిన తర్వాత మరో కీలకమైన షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా నిర్మిస్తున్న భారీ సెట్‌లో ఓ పాటను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఈ పాటను ప్రధానంగా ఎన్టీఆర్‌పై చిత్రీకరించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఈ పాట కోసం భారీ సెట్ ఏర్పాటు చేస్తున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాల్లో పాటల చిత్రీకరణకు ప్రత్యేకమైన సెట్స్, విభిన్నమైన నేపథ్యాలను ఉపయోగిస్తుంటారు.

'డ్రాగన్'లో కూడా ఈ పాటను ప్రత్యేకంగా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. అయితే పాటకు సంబంధించిన పూర్తి వివరాలు, చిత్రీకరణ తేదీలు, పాటలో కనిపించే ఇతర నటీనటుల గురించి చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ సినిమాల గురించి మాట్లాడగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకొచ్చేది బ్లాక్ అండ్ గ్రే ఛాయలతో కూడిన విజువల్స్, చీకటి నేపథ్యాలు, మాస్ యాక్షన్ సన్నివేశాలు. 'కేజీఎఫ్', 'సలార్' వంటి చిత్రాల్లో ఆయన అనుసరించిన దృశ్యశైలి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

# SYG షూటింగ్ పూర్తి



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు'(SYG). రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. పదికి పైగా భారీ షెడ్యూల్స్‌తో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికీ కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

## అమెరికాలో హిస్టారికల్

# వరల్డ్ ప్రీమియర్



దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఎంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

# వచ్చే ఏడాది దీపావళికి 'స్పిరిట్'



పాన్ ఇండియా ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'స్పిరిట్' ముందు వరుసలో ఉంటుంది. సాధారణంగా సందీప్‌రెడ్డి వంగా సినిమాల్లో హీరోలు విచిత్రమైన యాటిట్యూడ్‌తో కనిపిస్తుంటారు. 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండ, 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్, 'యానిమల్'లో రణబీర్‌కపూర్ పాత్రలే అందుకు నిదర్శనాలు. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాలో పాన్ ఇండియా సూపర్‌స్టార్ అయిన ప్రభాస్‌ని సందీప్ ఎలా చూపించబోతున్నాడు

..

అనే ఊహే ప్రేక్షకులను రోమాంచితులను చేస్తున్నది. అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ప్రభాస్ పాత్ర.. విభిన్నంగా, విచిత్రంగా, మాస్ ప్రేక్షకులు మురిసిపోయేలా, సగటు ప్రేక్షకుడు సంబరపడిపోయేలా, యువతరం ఉర్రూతలూగేలా ఉంటుందట. భద్రకాళి పిక్చర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది అక్టోబర్ 29న దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్, స్టైలిష్, మిస్టీరియస్ అవతారంలో ఉన్న ప్రభాస్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లాక్ క్యాప్, డార్క్ సన్ గ్లాసెస్, గడ్డంతో, రఫ్ అండ్ టఫ్‌గా క్లోజప్ ప్రొఫైల్ షాట్‌లో ప్రభాస్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు.

# ఆఫర్ల పేరుతో వినియోగదారులకు బురడీ

- సీఎంఆర్ షాపింగ్ మాల్ లో గోల్ మాల్
- రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామని ఆఫర్
- వెండి నాణెం కు బదులు వెండి పూత తో ఉన్న బిల్ల ఇస్తూ బురడీ











మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పండగలను దృష్టిలో పెట్టుకొని వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్ల పేరుతో వినియోగదారులను బూరడి కొట్టిస్తున్నారు. పండుగలు అనగానే షాపింగ్ లు చేయడం సహజం. వినియోగదారుల బలహీనతలను క్యాష్ చేసుకునేందుకు ఆఫర్లు పెడుతూ వినియోగదారులనుమోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటననే మేడ్చల్ పట్టణంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ లో చోటుచేసుకుంది. రూ.5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామంటూ ఆఫర్ పెట్టారు. ఈ ఆఫర్ ను చూసి ఆశపడ్డ వినియోదారులకు సిఎంఆర్ షాపింగ్ మాల్ వినియోగదారులను బురడి కొట్టిస్తూ వెండి నాణెం కు బదులు వెండి పూత బిల్లను చేతిలో పెడుతూ దిమ్మతిరిగే షాకిస్తున్నారు. పేరుకే వెండి నాణెం.. సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు ఇచ్చేది వెండి పూతతో కూడిన బిల్ల ఇస్తున్నారు. మేడ్చల్ కు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి తన కుటుంబంతో షాపింగ్ చేయడానికి సీఎంఆర్ షాపింగ్ మాల్ కు వచ్చాడు. తన ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా రూ. 3 వేల రూపాయల విలువగల షాపింగ్ చేశాడు. అయితే ఏమైనా ఆఫర్లు ఉన్నాయని ప్రశ్నించగా రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామని షాపింగ్ మాల్ సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఆశపడ్డ సదర్ వినియోగదారులు ప్రవీణ్ రూ. 5వేల బిల్లు చేశారు. దీంతో ఆఫర్ కింద వెండి నాణెం అంటూ ఓ బి ల్ల ను చేతిలో పెట్టారు.ఇంటికి వెళ్లి దానిని పరిశీలించగా వెండి నాణెం బదులు వెండి పూతతో ఉన్న బిల్లగా గుర్తించారు. వినియోగదారుడు ప్రవీణ్ మర్నటి రోజు సీఎంఆర్ షాపింగ్ మాల్ కు వెళ్లి సిబ్బందిని నిలదీశారు.వెండి నాణెం ఇస్తామన్నామే తప్ప అది వెండా లేక వెండి పూత నాణెం ఇస్తామని బోర్డు ఎక్కడ పెట్టలేదని వినియోగదారుడు ప్రవీణ్ పై ఆ షాపింగ్ మాల్ మేనేజర్ సుధాకర్ దబాయించారు. ఆఫర్ కింద ఇచ్చిన ( వెండితో కూడిన పూత బిల్ల) విలువ వంద రూపాయలు కూడా ఉండదని, వెండి నాణెం ఇస్తామంటే రూ. 5 వేల బిల్లు చేశామని, తీరా 100 రూపాయల విలువ లేని వెండి పూతతో కూడిన ఓ నాణెమును తన చేతిలో పెట్టారని సదరు వినియోదారుడు ప్రవీణ్ వాపోతున్నారు.

### వినియోగదారులను ఆకట్టుకునేలా ఆఫర్ల బోర్డులు

వినియోగదారులను ఆకట్టుకునేలా షాపు ముందే పెద్ద పెద్ద అక్షరాలతో ఆఫర్ల బోర్డును ఏర్పాటు చేశారు.రూ. 5 వేలు బిల్లు చేస్తే వెండి నాణెం ఫ్రీ అంటూ ఆఫర్ల బోర్డును ఏర్పాటు చేశారు. దీనిని చూసినా వినియోగదారులు వెండి నాణెం ఆశతో రూ. 5 వేల బిల్లు చేస్తూ షాపింగ్ మాల్ యాజమాన్యం చేతిలో వినియోగదారులు మోసపోతున్నారు. వెండి నాణెం అనే బదులు వెండి పూతతో కూడిన బిల్లను ఇస్తామని ఆఫర్ బోర్డుపై పెట్టి ఉంటే బాగుండేది అని వినియోగదారులు పేర్కొంటున్నారు. తన బిజినెస్ ను పెంపొందించుకోవడానికి ఇలా వినియోగదారులను మోసం చేయడం సరైన విధానం కాదు వినియోగదారులు పేర్కొంటున్నారు.

### వినియోగదారులను మోసం చేయడం లేదు

వినియోగదారులను ఎలాంటి మోసం చేయడం షాపింగ్ మాల్ మేనేజర్ సుధాకర్ పేర్కొన్నారు. షాపు ముందు రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తాం అంటూ ఆఫర్ పెట్టిన మాట వాస్తవమేనని అయితే ఎంత మోతాదులో ఇస్తామో మేము ఏ ఆఫర్ బోర్డు మీద పెట్టలేదని తెలిపారు.

వెండి నాణెం ఇస్తామా.. పూతతో కూడిన నాణెం ఇస్తామా ఆఫర్ బోర్డ్ మీద పెట్టలేదని దురుసుగా సమాధానం చెప్పారు. వెండి నాణెం ఇస్తామని ఆఫర్ ఇచ్చి ఇలా వెండి పూతతో కూడిన నాణెం ఇవ్వడం మోసం కాదా అంటూ విలేకరులు ప్రశ్నిస్తే ఎలా మోసం అవుతుంది అంటూ ఎదురు ప్రశ్న వేశారు.

### ఆఫర్లు అనగానే తొందర పడవద్దు

ఆఫర్లు అనగానే తొందరపడి ఏది కొనవద్దని, ఆలోచించి వివరాలు అన్నీ తెలుసుకున్నాక కొనుగోలు చేయాలని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు. ఇందుకు నిదర్శనం సిఎంఆర్ షాపింగ్ మాల్ ఏ కారణమని, రూ. 5 వేల బిల్ చేస్తే వెండి నాణెం ఇస్తామని ఆఫర్ పెట్టడం వారి బిజినెస్ టెక్నిక్ అని వినియోగదారులు పూర్తి వివరాలు తెలుసుకొని ముందుకు పోవాలని. ఇలా మోసపోవద్దని ఆర్థిక వేత్తలు

# ఆర్టీఐకి రెండేళ్లుగా సమాచారం లేదా.?

- తెలంగాణ ఇంటర్ విద్యలో 'స్నేహబంధం' వెనుక అసలేం జరుగుతోంది.?
- జయప్రద భాయ్-రచ్చ జ్యోత్స్నారాణి వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు
- ఒకేషనల్ అధ్యాపకుల పోస్టుల క్రమబద్ధీకరణపై సమగ్ర విచారణకు డిమాండ్
- సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యంపై అధికారుల తీరును ప్రశ్నిస్తున్న బాధితులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ఒకేషనల్ అధ్యాపకుల పోస్టుల క్రమబద్ధీకరణ, సమాచార హక్కు చట్టం కింద సమాచారం అందజేత అంశాలు వివాదాస్పదంగా మారాయి. అప్పటి ఆర్జేడీ జయప్రద భాయ్, రాష్ట్ర ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తున్న రచ్చ జ్యోత్స్నారాణి మధ్య ఉన్న స్నేహబంధం నేపథ్యంలో అధికారుల వ్యవహారశైలిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్నేహితురాలికి అనుకూలంగా వ్యవహరిస్తూ సమాచార హక్కు చట్టం అమలును నిర్లక్ష్యం చేస్తున్నారన్నది బాధితుల ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పోస్టుల సంఖ్య తగ్గింపుపై ప్రశ్నలు..

తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో కమలనాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం ఒకేషనల్ విభాగంలో 842 పోస్టులు ఉన్నట్లు చూపించారని, 2023లో క్యాడర్ స్ట్రెంత్ జీవో ప్రకారం ఆ సంఖ్యను 613కు తగ్గించారని సంబంధిత అధ్యాపకులు పేర్కొంటున్నారు. పోస్టుల సంఖ్య ఎందుకు తగ్గింది.? ఏ కోర్సుకు ఎన్ని మంజూరైన పోస్టులు ఉన్నాయి.? ఏ జీవోల ఆధారంగా పోస్టుల కేటాయింపులు జరిగాయి.? ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో కోర్సుల వారీగా ఉన్న పోస్టుల వివరాలేమిటి.? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కోరుతున్నారు.

### క్రమబద్ధీకరణలో అక్రమాల ఆరోపణలు

2023 మే 4న చేపట్టిన ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలు ఉన్నాయి. జీవో 16 ప్రకారం అర్హతలు, మంజూరైన పోస్టుల ఆధారంగానే క్రమబద్ధీకరణ జరగాల్సి ఉండగా, పోస్టుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారు 45 మంది అనర్హులకు పోస్టులు కల్పించి, ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై స్టేట్ విజిలెన్స్ అధికారులు వచ్చే విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విభాగంలో క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకుడికి కంప్యూటర్ సైన్స్ కోర్సుకు సంబంధించిన పోస్టును బదిలీ చేశారన్న అంశాన్ని కూడా బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అప్పటి కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొంటున్నారు.

### రెండేళ్లుగా ఆర్టీఐ సమాచారం కోసం నిరీక్షణ

ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణలో జరిగినట్లు చెబుతున్న లోటుపాట్లపై ఓ అధ్యాపకుడు 2025 జనవరి 2న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. దానికి కేసు నంబర్ 3317 కేటాయించినట్లు సమాచారం. అయినప్పటికీ కోరిన వివరాలు పూర్తిస్థాయిలో అందలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రచ్చ జ్యోత్స్నారాణి సమాచార హక్కు చట్టం కింద ప్రజా సమాచార అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, దరఖాస్తుపై నిర్ణీత గడువులో స్పందించకుండా నెలల తరబడి కాలయాపన చేశారని ఆరోపణలు ఉన్నాయి. చివరకు సంబంధిత సమాచారం తమ కార్యాలయంలో లేదని, వరంగల్ ఆర్జేడీ కార్యాలయం నుంచి పొందాలని సూచించినట్లు బాధితులు చెబుతున్నారు. సమాచారం అందుబాటులో లేకపోతే సంబంధిత కార్యాలయానికి దరఖాస్తును బదిలీ చేయాల్సిన బాధ్యత, దానికి వర్తించే చట్టపరమైన గడువులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### స్నేహబంధమా.. అధికార దుర్వినియోగమా.?

జయప్రద భాయ్‌కు సంబంధించిన వ్యవహారాలు బయటపడకుండా ఉండేందుకే జ్యోత్స్నారాణి సమాచారం ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నది బాధితుల ఆరోపణ. సమాచార హక్కు కమిషన్‌ను ఆశ్రయించినప్పటికీ తమకు పూర్తిస్థాయి సమాచారం అందలేదని పలువురు వాపోతున్నారు. అయితే వ్యక్తిగత స్నేహబంధం కారణంగా అధికార దుర్వినియోగం జరిగిందని నిర్ధారించాలంటే సంబంధిత రికార్డులు, ఫైళ్ల కదలికలు, నిర్ణయాలు, అధికారుల వివరణలపై నిష్పక్షపాత విచారణ కోరుతున్నారు.సమాచారం అందకపోవడంపై కోర్టును ఆశ్రయించిన ఓ బాధితుడి కేసులో ఇంటర్ బోర్డుకు రూ.25 వేల జరిమానా విధించినట్లు కూడా పేర్కొంటున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి

ఒకేషనల్ విభాగంలో మంజూరైన పోస్టుల సంఖ్య, క్రమబద్ధీకరణకు అనుసరించిన ప్రమాణాలు, కోర్సుల వారీగా పోస్టుల మార్పులు, విజిలెన్స్ ఫిర్యాదుల స్థితి, ఆర్టీఐ దరఖాస్తులపై తీసుకున్న చర్యలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలపై స్టేట్ విజిలెన్స్ తో విచారణ జరిపి, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు పారదర్శకత కల్పించేందుకు ఉద్దేశించినది. అధికారుల వ్యక్తిగత సంబంధాలు లేదా పరిపాలనా కారణాల వల్ల సమాచారం పొందే హక్కు దెబ్బతినకూడదు. జ్యోత్స్నారాణి వ్యవహారంపై ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.

## జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) విజయదశమి (దసరా) పండగ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులను, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరూ ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య మరియు సోదరభావంతో జరుపుకోవాలని, ప్రతి అడుగు విజయవంతం కావాలని కోరుకున్నారు.

## విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు

- 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది.ఇదిలా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది. డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్ మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

- రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు



ముంబై (ప్రశ్న న్యూస్) బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. దాడికి దాదాపు 20 రోజుల ముందే నిందితులు ముంబైకి చేరుకొని, పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారం రోజుల క్రితం టైగర్ ష్రాఫ్ ఆడుకుంటున్న ఫుట్‌బాల్ మైదానం వద్దకు వెళ్లి రెక్కీ కూడా నిర్వహించినట్లు గుర్తించారు. అరెస్టయిన వారిలో హర్యానాకు చెందిన ఫుల్‌సింగ్ నరేశ్, రెహాన్ రషీద్దీన్‌తో పాటు ముంబైలో నివసిస్తున్న హృతిక్ అనే రాపిడో డ్రైవర్ ఉన్నారు. వీరిలో హృతిక్ బైక్ నడపగా, మిగిలిన ఇద్దరు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 11న వీరు ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసినట్లు కూడా విచారణలో వెల్లడైంది.కాల్పుల అనంతరం పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ముందుగా బైక్‌పై అంధేరీ రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడి నుంచి లోకల్ ట్రైన్‌లో కాందివలీకి చేరుకున్నారు. ఆ తర్వాత క్యాబ్ బుక్ చేసుకొని సూరత్‌కు పారిపోయారు. అక్కడి నుంచి కోటా వెళుతున్న పుణే-జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కగా, పక్కా సమాచారంతో కోటా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్ ప్రకారం, కేవలం 15 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసి నిందితులను పట్టుకున్నారు. తొలుత ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోవాలని నిందితులు పథకం రచించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. నిందితుల్లో ఒకడైన రెహాన్‌కు, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న అనిల్ పండిట్‌తో పరిచయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే, కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని ఇంకా గుర్తించాల్సి ఉంది.గత ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ ఫుట్‌బాల్ మైదానం నుంచి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ స్వల్ప గాయాలతో బయటపడగా, డ్రైవర్ సహా మరొకరు గాయపడ్డారు. నిందితులను కస్టడీలోకి తీసుకునేందుకు ముంబై పోలీసుల బృందం కోటాకు చేరుకుంది. దాడి వెనుక అసలు కారణాలు తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588